



చింతలమానేపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల



ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందాలన్నా మంచి ఫలితాలు రావాలన్నా బోధన ఎంత ముఖ్యమో.. పర్యవేక్షణ కూడా అంతే ము ఖ్యం. కానీ కుమరం భీం జిల్లాలో విద్యా వ్యవస్థలను పర్యవేక్షించే అధికారులు కరువయ్యారు. సరైన పర్యవేక్షణ లేక విద్యార్థులకు మెరుగైన చదువు అందడం లేదని విమర్శలు ఉన్నాయి.

కొరవడిన పర్యవేక్షణ

- జిల్లా వ్యాప్తంగా ఇన్‌చార్జి ఎంఈవోల నియామకం
- అదనపు పని భారంతో సతమతం
- కొత్త మండలాల్లో ఇప్పటికీ లేని విద్యావనరుల కేంద్రాలు
- కార్యాలయాలు, సిబ్బంది లేక అవస్థలు
- ఏళ్లుగా పరిష్కారం కాని ఉపాధ్యాయుల సమస్యలు

చింతలమానేపల్లి, సెప్టెంబరు 26 : జిల్లాలో ఏళ్లుగా పూర్తిస్థాయి మండల విద్యాశాఖ అధికారులు లేక విద్యా వ్యవస్థ పూర్తిగా కుంటుప డుతున్న తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని మండలాలకు ఇన్‌చార్జీ ఎంఈవోలను నియమిస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా వ్యాప్తంగా పాత ప్రతీ ఎంఆర్‌సీ పరిధిలో ఇద్దరు కంప్యూటర్ ఆపరేటర్లు, ఒక ఆఫీస్ సబార్డినేట్ ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం జిల్లాలో ఎక్కడా కూడా పూర్తి స్థాయి సిబ్బంది లేరు. దీంతో ఉపాధ్యాయులకు సంబంధించిన పనులన్నీ పెండింగ్‌లో ఉంటున్నాయి. కొంతమంది సిబ్బందిని సమగ్ర శిక్షా అభియాన్ నుండి ఔట్ సోర్సింగ్ పద్దతిలో తీసుకున్నారు. పాత మండలాల్లో ఏ ఎంసీఆర్ పరిధిలో కూడా పూర్తి స్థాయిలో సిబ్బంది లేరు. దీంతో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎంఈవోలకు ఎన్నో ఏళ్ల సవాళ్లు కానున్నాయి. ఏళ్లుగా సమస్యలు, కార్యాలయాలు, సరైన సిబ్బంది లేక విధుల నిర్వహణపై నూతన ఇన్‌చార్జీ ఎంఈఓలు అయోమయంలో పడ్డారు.

పూర్తి స్థాయి అధికారులు లేక..

జిల్లాలో ఏళ్లుగా మండల విద్యాశాఖకు రెగ్యులర్ ఎంఈవో లేకపో వడంతో పర్యవేక్షణ పూర్తిగా లోపించింది. దీంతో క్రమేపీ ప్రభుత్వ పాఠశాలలంటే విద్యార్థుల్లో ఆసక్తి సన్నగిల్లింది. దీంతో విద్యాశాఖ రాష్ట్ర వ్యాప్తంగా ఎంఈవోల కొరతను తీర్చేందుకు ఆయా మండలాల పరిధిలో సీనియర్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులకు ఇంచార్జీ ఎంఈవోలుగా బాధ్యత లిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు జిల్లాలో 15 మండలాల కు గానూ ప్రస్తుతం అన్ని మండలాలకు ఇన్‌చార్జీ ఎంఈవోలను నియ మించింది. ఇది వరకు ఒక ఎంఈవోకు నాలుగు నుంచి ఐదు మండలాల బాధ్యతలు ఉండేవి. దీంతో పర్యవేక్షణ పూర్తిగా లోపించింది. ఉపాధ్యాయ సంఘాలు, విద్యావేత్తల నుంచి వచ్చిన సూచనల మేరకు ప్రభుత్వం, రాష్ట్ర విద్యాశాఖ మండలానికి ఒక పూర్తి స్థాయి ఎంఈవోలను నియమించేందుకు నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే కొన్ని మండ లాల్లో నోడల్ విద్యాశాఖ అధికారులుగా పని చేస్తున్న వారికి ప్రస్తుతం ఇన్‌చార్జీ ఎంఈవోలుగా నియమించారు. ఎంఈవోలుగా నియమిం చిన విద్యాశాఖ ఇంకా పూర్తి స్థాయి పరిపాలన ఉత్తర్వులను మాత్రం ఇవ్వలేదు. దీంతో మండలాల్లో విద్యావనరుల కేంద్రాలను ఏ విధంగా నిర్వ హించాలనే విషయంలో స్పష్టత లేకుండా పోయింది.

మూడు మండలాల పరిధిలో..

జిల్లాలోని చింతలమానేపల్లి, లింగాపూర్, పెంచికలపేట మండలాలు కొత్తగా ఏర్పాటు చేశారు. ఇప్పటికీ ఈ మండలాల్లో విద్యావనరుల కేంద్రాలు లేవు. పాత మండలాల్లోనే ఈ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం కౌటాలలో ఉన్న విద్యావనరుల కేంద్రం చింతలమానేపల్లి మండలానికి, పెంచికలపేట మండలానికి బెజ్జూరులో ఉన్న విద్యావనరుల కేంద్రం, లింగాపూర్ మండలానికి సైతం పాత మండలంలోనే విద్యావనరుల కేంద్రం ఉండగా వాటిలోనే పనులు సాగిస్తున్నారు. అయితే కొత్త మండలాల్లో నియమించిన విద్యాధికారులు ఎక్కడి నుంచి విధులు నిర్వహించాలన్న విషయంపై స్పష్టత లేదు. దీంతో అయోమయంలో ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వుల్లో ఎక్కడ నుండి విధులు నిర్వహించాలన్నది స్పష్టత లేక పోవవడంతో వారంతా ప్రస్తుతం పని చేస్తున్న పాఠశాల నుండే పర్యవేక్షణ చేయాల్సి ఉన్నది. పూర్తి స్థాయి ఆదేశాలు వచ్చే వరకు ఇదే పరిస్థితి ఉండే అవకాశం ఉన్నది. కాగా మండల విద్యావనరుల కేంద్రాల్లో ప్రస్తుతం జిల్లాలో ఎక్కడా కూడా పూర్తి స్థాయి సిబ్బంది లేరు. ఎంఈవోలు ఇతర సిబ్బంది తోనే పనులను నిర్వహిస్తున్నారు. విద్యాశాఖ జిల్లాలోని 15 మండలా లకు ఇన్‌చార్జీ ఎంఈవోలను నియమించినప్పటికీ సిబ్బంది సర్దుబాటు ఏ విధంగా చేస్తారన్న విషయంలో స్పష్టత లేదు. పూర్తి స్థాయి ఉత్త ర్వులు వస్తేమండల విద్యావనరుల కేంద్రాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు.

మూడు దశల ఉద్యమాల్లో పాత్ర

- యువతకు స్ఫూర్తిదాయకం
- నేడు కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి



కొండా లక్ష్మణ్ బాపూజీ(ఫైల్)

వాంకిడి, సెప్టెంబరు 26: స్వాతంత్ర్య పోరాటం, నిజాం నిరంకుశ వ్యతిరేక ఉద్యమం, ప్రత్యేక తెలంగాణ కోసం ఇలా మూడు దశల ఉద్యమాల్లో ప్రముఖ పాత్ర పోషించి దేశ సేవకు అంకితమైన వ్యక్తి కొండా లక్ష్మణ్ బాపూజీ. దశాబ్దాల తెలంగాణ కల సాకరమైన వేల ఆ స్వప్నాన్ని మాత్రం ఆయన చూడలేక పోయారు. ఉద్యమాలతో పాటు ప్రజాప్రతినిధిగా నిరంతరం ఆయన ప్రజా సేవ కోసం తపించారు. విద్యార్థి దశ నుంచే బాపూజీ జాతీయోద్యమానికి ప్రభావితులై నిజాం నిరంకుశ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మొదటి దశ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. మంత్రిగా ప్రజా సమస్యలపై పోరాడుతూనే తెలంగాణ సాధన ఉద్యమాలకు నాయకత్వం వహించారు. తెలంగాణ సాధన కోసం మంత్రి పదవికి రాజీనామా చేసి నిస్వార్థ ప్రజా నాయకుడిగా పేరు తెచ్చుకున్నారు. ప్రజా ఉద్యమాల్లోనే కాకుండా హైదరాబాద్ రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లోనూ బాపూజీ చురుకైన పాత్ర పోషించారు. తొలిసారిగా కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో 1952లో ఆసిఫాబాద్ ఎమ్మెల్యేగా ఎన్నికై దామోదరం సంజీవయ్య, కాసు బ్రహ్మానందరెడ్డి మంత్రి వర్గాల్లో పని చేశారు. రెండు సార్లు మంత్రిగా, ఒక్కసారి డిప్యూటీ స్పీకర్‌గా వ్యవహరించారు. 15 ఏళ్లు శాసన సభ్యుడిగా సేవలు అందించారు. శుక్రవారం కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి నిర్వహించనున్నారు.

- 12 రోజుల పాటు దీక్ష..

తెలంగాణ ఉద్యమానికి మద్దతుగా 1969లో 12 రోజుల పాటు దీక్ష చేశారు. ఆ సమయంలోనే మంత్రి పదవికి కూడా రాజీనామా చేశారు. తెలంగాణ తొలిదశ ఉద్యమంతోనే ఆయన విశ్రమించకుండా ప్రజా ఉద్యమం తెరపైకి వచ్చిన ప్రతీసారి తన వంతుగా మద్దతు పలికారు. 1997లో ఆయన స్థాపించిన తెలంగాణ ప్రజా పార్టీతో మరో సారి తెలంగాణ నినాదం తెరపైకి తెచ్చారు. ఆ తరువాత 2001లో కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర సమితి(టీఆర్ఎస్)ను నెలకొల్పిన సమయంలో బాపూజీ వెన్నుదన్నుగా నిలిచారు. ట్యాంక్‌బాండ్ వద్ద స్వగృహం జలదృశ్యంలోనే టీఆర్ఎస్ ఆవిర్భావ సభ జరిగిందంటే బాపూజీ కృషి ఎంతో అర్థం చేసుకోవచ్చు. 2007లో తెలంగాణ రాష్ట్ర సాధన సమితి అనే రాజకీయేతర సంస్థను స్థాపించారు. అనంతరం టీడీపీ నేత దేవేందర్‌గౌడ్ స్థాపించిన నవతెలంగాణ ప్రజా పార్టీకి మద్దతు పలికారు. 1969లో ప్రత్యేక తెలంగాణ కోసం జరిగిన ఉద్యమంలో చురుకుగా పాల్గొనడంతో అప్పటి ప్రభుత్వం బాపూజీని అరెస్టు చేసి రాజమండ్రి జైలుకు తరలించారు. 2010లో సైతం స్వాతంత్ర్య సమరయోధుల తెలంగాణ ఫోరం ఏర్పాటు చేసి దానికి కన్వీనర్‌గా ఉంటూ తెలంగాణ కోసం పని చేశారు. 1986లో తిరుపతి పట్టణంలో నిర్వహించిన రాష్ట్ర బీసీ సంఘాల ఐక్య వేదిక మహాసభలో బాపూజీ చేసిన సేవలను గుర్తించి ఆయకు ఆచార్య అని బిరుదును ప్రదానం చేసి గౌరవించారు. అనంతరం తెలంగాణ రాష్ట్రం ఏర్పడే వరకు అనేక ఉద్యమాలకు ప్రాతినిద్యం వహిస్తూ తెలంగాణ రాష్ట్ర సాధన దిశగా ఆయన కృషి చేశారు. 1997లో వాంకిడి మండలాన్ని సందర్శించిన బాపూజీ గ్రామ పెద్దలతో సమావేశం ఏర్పాటు చేసి తన ట్రస్టు ద్వారా సేవా కార్యక్రమాలు చేయడానికి ముందుకు వచ్చారు. మండలంలో 'లక్ష్మణ్ సేవా సదన్' సంస్థను స్థాపించారు. లక్ష్మణ్ సేవా సదన్ సంస్థ ద్వారా బాపూజీ తల్లిదండ్రుల స్మారకార్థం రెండు ముఖ ద్వారాలు (అర్చీలు) నిర్మించారు. పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు.

నేటి నుంచి సామాజిక తనిఖీలు

దహెగాం, సెప్టెంబరు 26: ఈజీఎస్‌లో 2023-24లో చేపట్టిన పనులకు శుక్రవారం నుంచి 12 గ్రామ పంచాయతీల్లో సామాజిక తనిఖీ బృందాలు తనిఖీలు చేపడుతాయని ఎంపీడీవో రాజేందర్ అన్నారు. కార్యదర్శులు, సామాజిక తనిఖీ బృందాలు, ఉపాధిహామీ సబ్బందితో గురువారం నిర్వహించిన సమావేశంలో ఎంపీడీవో మాట్లాడారు. తనిఖీల్లో చేపట్టే గ్రామ పంచాయతీల్లో రికార్డులు అందుబాటులో ఉంచాలన్నారు. కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఆర్పీ, డీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన

సిర్పూర్(టి), సెప్టెంబరు 26: ఎంపీడీవో కార్యాలయం ఎదుట నల్లగొండ జిల్లాలో ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ గురువారం ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణ, కార్యదర్శులు పాల్గొన్నారు.

దహెగాం: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో, కార్యదర్శులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేందర్ పాల్గొన్నారు.


రైతులు మెలకువలు పాటించాలి

వాంకిడి, సెప్టెంబరు 26: ఉద్యానవన పంటల సాగులో మెలకువలు పాటించాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త స్రవంతి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదికలో మామిడి, ఇతర ఉద్యానవన పంటల లో రైతులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కూరగాయల పంటలు పండించే విధానంలో మార్పు చేపట్టాలని పంట మొత్తం ఒకే సారి వేయకూడదని చెప్పారు. రెండు లేదా మూడు విడతలుగా వారం నుంచి పది రోజుల సమయం ఇస్తూ వేయాలన్నారు. వంకాయ, ఇతర కూరగాయల పంటలలో ఆకు ముడుత, కాయ తొలుచు పురుగు నివారణ చర్యలపై వివరించారు. కార్యక్రమంలో ఏవో గోపికాంత్, ఏఈవోలు రాజేశ్వర్, శంకర్, కృష్ణ, మానస, పరిమళ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

- కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, సెప్టెంబరు 26: గిరిజన ప్రాంతచట్టాలు 1/70, పేసాచట్టంపై అధికారులు అవగాహన కలిగిఉడాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో గురువారం అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. గిరిజన చట్టాలపై గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని అవగాహన పెంపొందించుకోవాలని అన్నారు. రాజ్యాంగం ప్రకారం గిరిజన ప్రాంతాలలో ఉన్న భూ చట్టాలు, పేసా చట్టాలను అందరు రక్షించాలని చెప్పారు. చట్టాల ఉల్లంఘన జరగకుండా అధికారులు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఐదో షెడ్యూల్ ప్రకారం గిరిజన ప్రాంతంలో రాజ్యాంగం గిరిజనుల కోసం ఎన్నో చట్టాలు తీసుకు వచ్చారని చెప్పారు. గిరిజనులు సంక్షేమం, హక్కుల రక్షణ కోసం అందరు సమిష్టిగా కృషి చేయాలని తెలిపారు. గిరిజన చట్టాలలో ప్రతి అంశంపై అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. హైదరాబాద్ నుంచి వచ్చిన ప్రత్యేకాదికారి ఎంఎ ఆదిల్ ఏజెన్సీ చట్టాలు, పేసా చట్టాలలో పలు అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవ గాహన కల్పించారు. అధికారులు వీటి అమలుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లా, ఆర్డీవో లోకేశ్వర్‌రావు గిరిజనాభివృద్ధి అధికారి రమాదేవి, జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి, ఉట్నూర్ ఎస్‌డీసీ గంగాధర్ ఆయా మం డలాల తహసీల్దార్‌లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు తదితరులు పాల్గొన్నారు.



సీఎంపీఎఫ్ కుంభకోణంపై విచారణ చేపట్టాలి



జీఎంకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

శ్రీరాంపూర్, సెప్టెంబరు 26: సీఎంపీఎఫ్‌లో జరిగిన వెయ్యి కోట్ల రూపాయల కుంభకోణంపై విచారణ చేపట్టాలని బీఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు నాతాడి శ్రీధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. జీఎం కార్యాలయం ఎదుట గురువారం బీఎంఎస్ నాయకులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధ్యులైన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, దుర్వి నియోగమైన సొమ్మును తిరిగి రాబట్టాలని కోరారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జీఎం సంజీవరెడ్డికి అందజేశారు. ధర్నాలో రాగం రాజేందర్, గూడ శ్రీకాంత్, పురు షోత్తమాచారి, బొంపల్లి రమేశ్, కట్కూరి సతీష్ కుమార్, బోయిన మల్లయ్య, జెల్ల తిరుపతి, గోళ్ల మహేందర్, అన్ని గనులకు చెందిన పిట్ కార్యదర్శులు పాల్గొన్నారు.

లాభాల వాటాపై శ్వేతపత్రం విడుదల చేయాలి

శ్రీరాంపూర్, సెప్టెంబరు 26: సింగరేణి లాభాల వాటాపై శ్వేతపత్రం విడుదల చేయాలని సీఐటీయూ మందా నర్సింహారావు అన్నారు. నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌తో పాటు ఆర్‌కే 7 గనిపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు సమావేశంలో సీఐటీయూ ఏరియా అధ్యక్షుడు గుళ్ల బాలాజీ, కార్యదర్శి అంబాల శ్రీనివాస్, ఆర్గనైజింగ్ కార్యదర్శి వెంగళ శ్రీనివాస్, కోశాధికారి కస్తూరి చంద్రశేఖర్, రాష్ట్ర కమిటీ సభ్యుడు నరహరి రావు, పిట్ కార్యదర్శులు సదానందం, శ్రీనివాస్, ప్రవీణ్, నవీన్, క్రిష్ణ, పాల్గొన్నారు.

రిటైర్డు కార్మికులకు గ్రాట్యూటీ చెల్లించాలి

బెల్లంపల్లి, సెప్టెంబరు 26: సింగరేణి యాజమాన్యం రిటైర్డు కార్మికులకు 20 లక్షల రూపాయల గ్రాట్యూటీ చెల్లించాలని టీఎస్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి మణిరాంసింగ్ డిమాండ్ చేశారు. పట్టణంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మధుసూదన్‌రెడ్డి, రాజయ్య, సత్తయ్య, ఓదెలు, తాహెర్‌ఖాన్ పాల్గొన్నారు.

కార్మికులకు వాస్తవ లాభాలు చెల్లించాలి

మందమర్రిటౌన్, సెప్టెంబరు 26: కార్మికులకు ప్రభుత్వం వెల్లడించిన 4,701 కోట్ల వాస్తవ లాభాలను చెల్లించాలని గురువారం టీబీజీకేఎస్ నాయకులు కేకే 5 గనిపై సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో జె రవీందర్ వీరారెడ్డి, తోట శ్రీను, శ్రీనివాస్, మల్లేష్, రాజలింగు తదితరులు పాల్గొన్నారు.

లాభాల బోనస్ ఇప్పించాలి

రెబ్బెన, సెప్టెంబరు 26: సింగరేణిలో దీపావళి లాభాల బోనస్ కూడా లక్ష రూపాయల వరకు ఇప్పించాలని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం బెల్లంపల్లి ఏరియా వైస్ ప్రసిడెంట్ శ్రీనివాస్‌రావు అన్నారు. గురువారం స్థానికంగా మాట్లాడారు. సమావేశంలో టీబీజీకేఎస్ ఏరియా కార్యదర్శి మారిన వెంకటేష్, సెంట్రల్ కమిటీ నాయకులు సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

టీసీఓఏ క్లబ్‌లో లాన్ టెన్నిస్ పోటీలు

రెబ్బెన, సెప్టెంబరు 26: బెల్లంపల్లి టీసీఓఏ క్లబ్‌లో గురువారం లాన్ టెన్నిస్ పోటీలు జరిగాయి. బెల్లంపల్లి ఏరియా హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ ఏఎస్ఎస్ రాధాకృష్ణ మాట్లాడారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

హువర్ డ్యామ్ స్ఫూర్తితో రాష్ట్రంలో రక్షణ చర్యలు



హువర్ డ్యామ్ పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం, అధికారుల బృందం

మంచిర్యాల, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): అమెరికాలోని నేవడ, అరిజోన రాష్ట్రాల సరిహద్దులో కొలరాడో నదిపై నిర్మించిన అతిపెద్ద జలవిద్యుత్ ప్రాజెక్టు హువర్ డ్యామ్ ఆదర్శవంతమైందని, ఇక్కడి నీటి వినియోగం, అమలవుతున్న రక్షణ చర్యలు ఆచరించదగినవని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. అమెరికా పర్యటనలో ఉన్న ఆయన రాష్ట్ర ప్రతినిధి బృందంలో గల ఇంధన శాఖ కార్యదర్శి రోనాల్డ్ రోస్, సింగరేణి సీఎండీ బలరామ్, స్పెషల్ సెక్రెటరీ కృష్ణ భాస్కర్ తదితరులతో కలిసి గురువారం హువర్ డ్యామ్‌ను సందర్శించారు. తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు ఏర్పడిన కాలంలో 1931-36 మధ్య నిర్మించిన ఈ ఆర్క్ గ్రావిటీ నిర్మాణం ఒక ఇంజనీరింగ్ అద్భుతమని, ఇక్కడ గల 17 జనరేటర్ల ద్వారా 2080 మెగావాట్ల జల విద్యుత్ ఉత్పత్తి అవుతుందని, తద్వారా మూడు రాష్ట్రాల విద్యుత్ అవసరాలను తీరుస్తుందని డిప్యూటీ సీఎం బృందానికి అక్కడి అధికారులు వివరించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి అక్కడ జరుగుతున్న జల విద్యుత్తు ఉత్పాదకత, యంత్రాల సామర్థ్యం, నీటి లభ్యత, రక్షణ చర్యలు, తదితర సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. తెలంగాణలో గల జల విద్యుత్తు ప్రాజెక్టుల సమాచారంతో బేరీజు వేస్తూ హువర్ డ్యామ్ జలవిద్యుత్ ఉత్పాదకతను స్ఫూర్తిగా తీసుకొని ఇక్కడి ప్రాజెక్టుల సామర్థ్యం పెంపుదల, రక్షణ అవకా శాలను పరిశీలించాలని రాష్ట్ర అధికారులను కోరారు. అనంతరం వివిధ ప్రఖ్యాత కంపెనీల స్టాల్స్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా వర్చువల్ రియాలిటీ మైనింగ్ టెక్నాలజీని ఆయన పరిశీలించారు. ఆధునిక సాంకేతికత వల్ల కార్మికులకు చిన్న ప్రమాదం కూడా జరగకుండా ఉత్పత్తిలో పాల్గొనే అవకాశం ఉంటుందని, సింగరే ణి కార్మికుల రక్షణను దృష్టిలో పెట్టుకొని ఈ తరహా సాంకేతికతను ప్రస్తుత, భవిష్యత్తులో ఏర్పాటు చేయబోయే గనుల్లో ప్రవేశపెట్టడానికి గల అవకాశాలను పరిశీలించాలని బృంద సభ్యులకు సూచించారు.

సీఎంపీఎఫ్ చిట్టీల పునరుద్ధరణ

కాసిపేట, సెప్టెంబరు 26: సింగరేణిలో గత కొంత కాలంగా నిలిచిపోయిన సీఎంపీ ఎఫ్ చిట్టీలను పునరుద్ధరించారు. ఈ మేరకు గురువారం కాసిపేట గనిపై ఇన్‌చార్జీ గని మేనేజర్ నిఖిల్ అయ్యర్ కార్మికులకు సీఎంపీఎఫ్ చిట్టీలు అందించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి మీనుగు లక్ష్మీనారాయణ, నాయకులు శ్రీనివాస్, సురేష్, కమలాకర్, లింగయ్య, అధికారులు వెంకటేశ్వర్లు, జిషా, లక్ష్మణ్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.

అలవెన్స్ కటింగ్ నిలిపివేయాలి

కాసిపేట, సెప్టెంబరు 26: కాసిపేట 1వ గనిలో కంపెనీ అవసరం నిమిత్తం 473 మంది కార్మికులను సర్ఫేస్‌లోకి తీసుకుందని, వీరికి యాజమాన్యం అండర్‌గ్రౌండ్ అలవెన్స్ కటింగ్ చేయడాన్ని నిలిపివేయాలని ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచీ కార్యదర్శి దాగం మల్లేష్ కోరారు. ఈ మేరకు గనిపై ఏఐటీయూసీ నాయకులు గురువారం నిరసన తెలిపారు. కార్యక్రమంలోపిట్ కార్యదర్శి మీనుగు లక్ష్మీనారాయణ, శ్రీహరి, సురేష్, రంజిత్‌కుమార్,లింగయ్య, కమలాకర్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ జనరల్ మేనేజర్‌కు సన్మానం

శ్రీరాంపూర్, సెప్టెంబరు 26: కార్పొరేట్ జనరల్ మేనేజర్(సీహెచ్‌పీ)గా నూతనంగా బాధ్యతలు చేపట్టి శ్రీరాంపూర్‌కు వచ్చిన ఎం తిరుమల రావును ఏరియా జీఎం బి సంజీవరెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం సత్యనారాయణ, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు కె. వెంకటేశ్వర్ రెడ్డి, ఓసీపీ పీవో టి. శ్రీనివాస్, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్ రెడ్డి, డీజీఎంలు అరవిందరావు, రవీందర్, డిప్యూటీ సీఎంఓ డాక్టర్ రమేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు. కాగా శ్రీరాంపూర్‌లోని ఏరియా స్టోర్స్‌లో స్వచ్ఛత 4.0 కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో అధికారుల సంఘం అధ్యక్షుడు కె. వెంకటేశ్వర్ రెడ్డి, డీజీఎంలు అరవిందరావు, మల్లయ్య, టింబర్ యార్డు ఇన్‌చార్జి జక్కారెడ్డి, పర్యావరణ అధికారి హన్మాన్‌గౌడ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్, టీబీజీకేఎస్ ఆందోళనలు సరికాదు

శ్రీరాంపూర్, సెప్టెంబరు 26: లాభాల వాటా విషయంలో కార్మికులను తప్పుదోవ పట్టించే విధంగా బీఆర్ఎస్, టీబీజీకేఎస్ ఆందోళనలు చేయడం సరికాదని ఐఎన్‌టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు శంకర్‌రావు అన్నారు. బాయిబాటలో భాగంగా ఆర్‌కే 6 గనిని సందర్శించి కార్మికుల సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో జాతీయ సమితి ఉపాధ్యక్షుడు సీహెచ్ భీంరావు, కేంద్ర ఉపాధ్యక్షుడు కలవేణ శ్యామ్, ఉప ప్రధాన కార్యదర్శి స్వామి, బ్రాంచ్ కోశాధికారి వెంకటేశ్వర్లు, నాయకులు సంతోష్, మహేష్, కుమారస్వామి, ప్రవీణ్, పాల్గొన్నారు.

లాభాల వాటాపై ఆరోపణలు సరికావు



మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు సీతారామయ్య

మందమర్రిటౌన్, సెప్టెంబరు 26: సింగరేణి కార్మికులకు లాభాల వాటాపై కొన్ని సంఘాలు చేస్తున్న ఆరోపణలు సరైనవి కావని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. ఏఐటీయూసీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో వెల్లడించిన వాస్తవ లాభాలు తెలపాలని డిమాండ్ చేశారు.. ప్రభుత్వం వాస్తవలాభాలను వెల్లడించి వాటా అందిస్తుందన్నారు. కాంట్రాక్టు కార్మికులకు వాటా చెల్లింపులో తమయూనియన్ ప్రధాన పాత్ర పోషించిందని చెప్పారు. పదేళ్ల లాభాల లెక్కలను చూపించారు. సమావేశంలో సలేంద్ర సత్యనారాయణ, భీమనాధుని సుదర్శన్, దాగం మల్లేష్, అక్బర్ అలీ పాల్గొన్నారు.

శ్రీరాంపూర్: లాభాల వాటాపై అన్ని సంఘాలు దుష్ప్రచారం చేస్తున్నాయని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు సీతారామయ్య అన్నారు. నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. సమావేశంలో ఉప ప్రధాన కార్యదర్శి కందికట్ల వీరభద్రయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా, సతీష్, మారెపల్లి బాబు, నవీన్ రెడ్డి, అఫ్రోజ్‌ఖాన్, దేవేందర్, సురేష్, సదానందం, సత్యనారాయణ, పరశురాం పాల్గొన్నారు.

రౌటసంకెపల్లిలో వైద్య శిబిరం

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 26: మండలంలోని రౌటసంకెపల్లి గ్రామంలో మాజీ జడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, మాజీ ఎంపీపీ మల్లికార్జున్ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పలు వురికి పరీక్షలు నిర్వహించి మం దులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో తుకారాం, డీఆర్‌డీవో దత్త, డాక్టర్ వినోద్‌కుమార్‌ను సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, నాయకులు మంగ, సత్తన్న, శ్రీకాంత్, గొల్లయ్య, బిజు, గట్టయ్య, పుల్లయ్య, ప్రసాద్‌గౌడ్, లింగయ్య, కిష్టయ్య, సత్య నారాయణ, లింగయ్య, తిరుపతి, కొండు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



హత్యాయత్నం కేసులో ఐదుగురు అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ ప్రకాష్

మంచిర్యాల, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బైపాస్ రోడ్డులో కాంగ్రెస్ నాయకుడు జగన్మోహన్‌రావు అనుచరుడు మేర సంజీవ్‌పై జరిగిన హత్యాయత్నం కేసులో ఐదుగురిని గురువారం అరెస్టు చేసినట్టు ఏసీపీ ప్రకాష్ తెలిపారు. ఆయన కార్యాలయంలో కేసు వివరాలను వెల్లడించారు. బీఆర్ఎస్ యూత్ లీడర్ గడప రాకేష్ గత సంవత్సరం జగన్మోహన్ ఇంటికి వెళ్లి దాడికి పాల్పడ్డాడు. రాకేష్ తన ఉనికిని చాటుకునేందుకు రౌడీషీటర్ పోచంపల్లి సంపత్, విశాల్, కుంట శ్రీధర్, పంగ శ్రీధర్, ఉడత అజయ్, మామిళ్ల సేతు, మునకపల్లి శశిధర్, జ్ఞానేశ్వర్, రుద్రతేజ, అన్నమయ్య, కూర్మ ప్రవీణ్, చంటి, తోళ్లవాగు సలీంలు గద్దెరేగడిలోని నగేష్ ఇంట్లో సమావేశమయ్యారు. ఈ నెల 24న రాత్రి మేర సంజీవ్‌పై దాడి చేయగా అతడి వెంట ఉన్న తోటమాలి అబ్దుల్ అఫ్రోజ్, వాచ్‌మన్ దోమల శంకరయ్యలు అడ్డుకోగా వారికి గాయాలయ్యాయి. దాడి చేసేందుకు వచ్చిన రుద్రతేజ, జ్ఞానేశ్వర్ సైతం గాయపడ్డారు. దాడి అనంతరం హైదరాబాదుకు పారిపోయేందుకు ప్రయత్నించగా మంచిర్యాలకు చెందిన కుంట శ్రీధర్, షేక్ అబ్దుల్ రసూల్, ఎండీ.అన్వర్‌పాషా, జుమ్మాడా పున్నం, రామకృష్ణాపూర్‌కు చెందిన పులగం నగేష్‌లను రైల్వే స్టేషన్‌లో పట్టుకున్నామని, మిగతా వారు పరారీలో ఉన్నారని వివరించారు. నిందితులు అందరూ నేరచరిత్ర కలిగిన వారేనని తెలిపారు. పోచంపల్లి సంపత్, శశి, శ్రీధర్, చంటిలపై రౌడీషీట్లు ఉన్నాయి. మిగతావారిపై కూడా రౌడీ షీట్లు తెరుస్తామని ఏసీపీ పేర్కొన్నారు. పట్టణ సీఐ బన్సీలాల్ ఉన్నారు.

గంజాయి సేవిస్తున్న 8మంది అరెస్టు

నెన్నెల, సెప్టెంబరు 26: గంజాయి సేవిస్తున్న 8 మంది యువకులను నెన్నెల పెద్ద చెరువు శివారులో గురువారం పట్టుకున్నామని ఏసీపీ రవికుమార్ తెలిపారు. రూరల్ సీఐ అఫ్జలుద్దీన్, ఎస్సై ప్రసాద్‌తో కలిసి బెల్లంపల్లిలో వివరాలు వెల్లడించారు. కొందరు యువకులు చెరువు వద్ద గంజాయి సేవిస్తున్నారని అందిన పక్కా సమాచారం మేరకు నెన్నెల ఎస్సై చెరువు వద్దకు వెళ్ళాడు. పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించగా పట్టుకొని సోదాలు చేయగా తాళ్లగురిజాలకు చెందిన మహమ్మద్ ముస్తఫా గంజాయి విక్రయిస్తుండగా అతడి వద్ద రూ.3750 విలువగల 169 గ్రాముల గంజాయి లభించిందన్నారు. గంజాయి ప్యాకెట్‌తోపాటు నాలుగు బైక్‌లు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ముస్తఫాతో పాటు నెన్నెల మండలం ఘన్‌పూర్‌కు చెందిన పోతురాజుల ఆకాష్, కన్నెపల్లి మండలం చర్లపల్లికి చెందిన శనిగారపు వినోద్, బెల్లంపల్లి మండలం దుగ్నెపల్లికి చెందిన జాడి సుందర్, సల్లూరి రమాకాంత్, నెన్నెలకు చెందిన దుర్గం స్వామి, పిట్ట శేఖర్, గుండ్లసోమారానికి చెందిన రత్నం దేవేందర్, బెల్లంపలికి చెందిన జమీల్‌లపై కేసు నమోదు చేసినట్లు వివరించారు. గంజాయి విక్రయించే, సేవించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏసీపీ హెచ్చరించారు.

యువత గంజాయి బారిన పడవద్దు

బెల్లంపల్లిరూరల్, సెప్టెంబరు 26 : యువత గంజాయి బారిన పడవద్దని సీఐ అఫ్జలుద్దీన్ అన్నారు. గురువారం బూదకలాన్‌లో కార్డెన్‌సర్చ్ నిర్వహించారు. సరైన పత్రాలు లేని 30 మోటారు సైకిళ్లు, 8 ఆటోలు, రూ.9950 విలువగల మద్యాన్ని సీజ్ చేశారు. సీఐ మాట్లాడుతూ ఎవరు గంజాయి, ఇతర మత్తు పదార్థాలను సేవించవద్దని సూచించారు. యువత గంజాయి బారిన పడి విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. గంజాయి సేవించినా, రవాణా చేసినా చర్యలు ఉంటాయని తెలిపారు. సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా అత్యవసరం అయితే డయల్ 100కు ఫోన్ చేయాలన్నారు. ఎస్ఐలు రమేష్, మహేందర్, పోలీసులు పాల్గొన్నారు.

బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలి

నెన్నెల, సెప్టెంబరు 26: బాలికలు రక్తహీనత లేకుండా పోషక విలువలతో కూడిన పౌష్టిక ఆహారం తీసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్‌నాయక్ అన్నారు. చిత్తపూర్ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో గురువారం నిర్వహించిన గిరిపోషన్ మిత్ర కార్యక్రమంలో మాట్లాడారు. బాలికల్లో రక్తహీనతను దూరం చేసేందుకు ప్రభుత్వం గిరిపోషన్ మిత్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. 10 నుంచి 19 సంవత్సరాల కౌమర బాలికలకు సీబీపీ పరీక్షలు నిర్వహిస్తున్నామని, రక్తహీనతతో బాధపడుతున్న వారిని గుర్తించి మందులు అందజేస్తున్నామన్నారు. రక్తం తక్కువగా ఉన్న వారు ఐరన్ కలిగిన ఆహారం తీసుకోవాలన్నారు. బరువు తక్కువగా ఉన్న బాలికలను గుర్తించి వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. విద్యార్థులకు ఏనీమియా, సికిల్‌సెల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. 86 మంది బాలికలకు రక్త పరీక్షలు నిర్వహించారు. నెన్నెల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మణ్, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయం చేయాలని సబ్ కలెక్టర్‌కు వినతి

కాగజ్‌నగర్ టౌన్, సెప్టెంబరు 26: తమకు న్యాయం చేయాలంటూ సిర్పూర్ (టి) మండలంలోని ఇటిక్యాల పహాడ్ గ్రామస్థులు గురువారం కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లాను కలిసి విజ్ఞప్తి చేశారు. 45 ఏళ్లుగా తమ గ్రామంలో పోడు వ్యవసాయం చేసుకుంటున్నామని చెప్పారు. ఆరు సంవత్సరాల క్రితం ఫారెస్టు అధికారులు తమ భూములను లాక్కున్నారని చెప్పారు. దీంతో 2,500 ఎకరాల భూమికి గాను ప్రస్తుతం 400 ఎకరాలు మిగిలిందన్నారు. తమ భూములు తమకు ఇప్పించాని, లేకుంటే తమకు ఎక్కడైనా పునరావాసం కల్పించాలని సబ్ కలెక్టర్‌ను వేడుకున్నారు. అనంతరం వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో 200 మంది రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఎస్పీఎం కాలుష్యంపై చర్యలు తీసుకోవాలి

కాగజ్‌నగర్, సెప్టెంబరు 26: ఎస్పీఎం కాలుష్యంపై అధికారులు వెంటనే జెకె యాజమాన్యంపై తగిన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ పార్టీ సిర్పూరు నియోజకవర్గ కన్వీనర్ లెండుగురే శ్యాంరావు తెలిపారు. గురువారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్పీఎం కాలుష్యంతో సమీప కాలనీల్లోకి నేరుగా పొగ వస్తోందన్నారు. దీంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఇంత జరుగుతున్నా కూడా కాలుష్య నియంత్రణ మండలి అధికారులు కనీసం పట్టించుకోవటం లేదన్నారు. కాలుష్యం బారిన ఈ ప్రాంత ప్రజలు పడి అవస్థలు పడాల్సిన పరిస్థితి ఉందన్నారు. మిల్లులో మాత్రం ఇతర రాష్ట్రాల వారికి ప్రాధాన్యం ఇవ్వడం దారుణమన్నారు. దీనిపై బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమ బాట పడుతామని తెలిపారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు నక్క మనోహర్, మోయిన్, దాసరి నరేందర్, ఆవుల రాజ్‌కుమార్, సలీం, గోగర్ల కన్నయ్య, సలీం, శోభన్, అంజన్న, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

మొబైల్ ఫోన్ వెలుతురులో కబడ్డీ పోటీలు

కౌటాల, సెప్టెంబరు 26: కౌటాల మండల కేంద్రంలోని జడ్పీఎస్ఎస్‌లో జిల్లా స్థాయి అండర్-17 కబడ్డీ పోటీలు నిర్వహించారు. అయితే నిర్వాహణ కమిటీ సరిగ్గా ఏర్పాటు చేయక పోవడంతో పాటు పోటీలు ఆలస్యం కావడంతో చీకటి పడింది. దీంతో ఉపాధ్యాయులు సెల్‌ఫోన్ లైట్ల వెలుతురిలో ఫైనల్ ఆటలు ఆడించారు. నిర్వహణ కమిటీ లైట్ కూడా పెట్టకుండా సెల్‌ఫోన్ లైట్ల వెలుతురులో ఫైనల్ ఆటలు ఆడించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రేపు జిల్లా స్థాయి చెస్ పోటీలు

ఆసిఫాబాద్, సెప్టెంబరు 26: జిల్లా స్కూల్ గేమ్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో అండర్-14, 17 బాలబాలికలకు జిల్లా స్థాయి చెస్ పోటీలు శనివారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని గిరిజన క్రీడాధికారి మీనారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని గిరిజన బాలికల క్రీడా పాఠశాలలో చెస్ అసోసియేషన్ సహకారంతో పోటీలు నిర్వహించనున్నామని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు జిల్లా చెస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కల్పన (8978146456)ను సంప్రదించాలని సూచించారు.

ఎంబీబీఎస్ ఫస్ట్‌ఇయర్ ఫలితాల విడుదల

ఆసిఫాబాద్, సెప్టెంబరు 26: ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం పరీక్ష ఫలితాలను మెడకల్ బోర్డు గురువారం విడుదల చేసిందని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి సతీష్‌కుమార్ తెలిపారు. కుమరం భీం ఆసిఫాబాద్ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరంలో 99 మంది పరీక్ష రాయగా అందులో ఇద్దరు డిస్టెక్షన్ సాధించారని చెప్పారు. ఫస్ట్ క్లాస్‌లో 25మంది, సెకండ్ క్లాస్‌లో 61 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పి సతీష్‌కుమార్ తెలిపారు.

అక్రిడిటేషన్ కార్డుల గడువు పొడిగింపు

ఆసిఫాబాద్ రూరల్, సెప్టెంబరు 26: అక్రిడిటేషన్ కార్డుల గడువను మరోమూడు నెలలు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు కలెక్టర్ వెంకటేష్ దోత్రే గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్డుల గడువును 01-10024 నుంచి 31-12-2024 వరకు పొడిగిస్తూ కలెక్టర్‌లు, ఆర్టీసీ సంస్థకు సమాచార పౌర సంబంధ స్పెషల్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేసనట్లు ఆయన తెలిపారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 26: జిల్లా కేంద్రంలోని టాస్క్ కార్యాలయం(పాత కలెక్టరేట్ భవనం)లో టాస్క్ ద్వారా అక్టోబరు 1న నిర్వహించే జాబ్‌మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని జిల్లా టాస్క్ రీజనల్ సెంటర్ మేనేజర్ సాయికుమార్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. 30 ఏళ్ల లోపునిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు టాస్క్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ఉపాధ్యాయులకు అవగాహన

వాంకిడి, సెప్టెంబరు 26: ప్రశస్త యాప్‌పై గురువారం స్థానిక ఉన్నత పాఠశాలలోఎంఈవో శివచరణ్‌కుమార్ ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా 63 అంశాలపై అవగాహన కల్పించారు. వచ్చే నెల 6 వరకు దివ్యాంగ విద్యార్థులకు స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించనున్నామని చెప్పారు. మండలంలో 110 మంది దివ్యాంగ విద్యార్థులను గుర్తించామని తెలిపారు. ఉపాధ్యాయులు తగిన చర్యలు తీసుకోవాలని ఎంఈవో సూచించారు. కార్యక్రమంలో ఆర్పీలు దుర్గయ్య, వినేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వివాహిత ఆత్మహత్య

గర్మిళ్ల, సెప్టెంబరు 26: జిల్లా కేంద్రంలోని భగవంతం వాడకు చెందిన కొంపదల్లి సంగీత(30) అనే వివాహిత రైలు కింద పడి ఆత్మహత్య చేసు కుంది. ఆమె ఆత్మ హత్యకు గల కారణాలు తెలియ రాలేదని జీఆర్పీ ఎస్‌ఐ మహేందర్ తెలిపారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించామని, మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీ గదిలో భద్రపర్చినట్లు తెలిపారు. సంగీతకు భర్త రమేష్, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి


లక్ష్మారెడ్డి (ఫైల్)

నస్పూర్, సెప్టెంబరు 26: నస్పూర్, మంచిర్యాల మధ్య గల 63వ జాతీయ రహదారిపై తోళ్ళ వాగు వద్ద గురువారం బైక్ అదుపు తప్పి డివైడర్‌కు ఢీకొన్న ప్రమాదంలో పోరెడ్డి లక్ష్మారెడ్డి (67) అక్కడి కక్కడే మృతి చెందాడు. మంచిర్యాల పట్టణం రెడ్డి కాలనీకి చెందిన లక్ష్మారెడ్డి సింగరేణి ఉద్యోగం చేసి పదవీ విరమణ పొందాడు. రిటైర్డ్ అనంతరం లారీని కొనుగోలు చేశాడు. లారీ అసోసి యేషన్‌కు సంబంధించిన పని ఉండడంతో కలెక్టరేట్‌కు వచ్చి తిరిగి ఇంటికి వెళ తుండగా తోళ్ళవాగు వద్దకు చేరగానే ద్విచక్ర వాహనం అదుపు తప్పి డివైడర్‌కు ఢీకొంది. ప్రమాదంలో తలకు బలమైన గాయం తగిలి అక్కడికక్కడే మృతి చెందాడని ఎస్సై సుగుణాకర్ తెలిపారు. భార్య సుజాత, కూతురు స్వప్న ఉన్నారు. మృతదేహాన్ని మంచిర్యాల ప్రభు త్వాసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రమాదవశాత్తు వాగులో పడి..


మల్లేష్ (ఫైల్)

భీమిని, సెప్టెంబరు 26: మండల కేంద్రానికి కళ్యాణం మల్లేష్ (45) అనే వ్యక్తి భీమిని ఎర్ర వాగులో ప్రమాద వశాత్తు పడి మృతి చెందాడు. మల్లేష్ మండలంలోని మామిడిపెల్లి గ్రామానికి వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో మల్లేష్ మద్యం మత్తులో వాగులో పడి మృతి చెందినట్లు అనుమానిస్తున్నారు. భార్య కమల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకు న్నట్లు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు. మృతుడికి కుమారుడు, కూతురు ఉన్నారు.

ఆర్టీసీ కండక్టర్‌పై దాడి : కేసు నమోదు

భీమారం, సెప్టెంబరు 26: ఆర్టీసీ కండక్టర్‌పై దాడి చేసినందుకు సిడం మహేష్ అనే ప్రయాణికుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాములు తెలిపారు. ఏపీ29 జెడ్3067 మంచిర్యాల డిపో బస్సు మంచిర్యాల నుంచి వస్తుండగా చెన్నూరులో బస్టాండ్ నుంచి 8మంది ప్రయాణికులతో బయలు దేరింది. మార్గమ ధ్యలో సిడం మహేష్ ప్రయాణికులతో గొడవ పడగా బస్సులో గొడవ పడవద్దని కండక్టర్ గాదె భాస్కర్ సూచించాడు. దీంతో భాస్కర్‌పై మహేష్ దాడి చేశారు. కండక్టర్ ఫిర్యాదు మేరకు మహేష్‌పై కేసు నమోదు చేశామన్నారు.

గుడిపేట కమాండెంట్‌కు సన్మానం

హాజీపూర్, సెప్టెంబరు 26: గుడిపేట 13వ బెటాలియన్ కమాండెంట్ వెంకటరాములును గురువారం లయన్స్‌క్లబ్ సభ్యులు సన్మానించారు. అక్టోబరు 1న జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం పురస్కరించుకుని మెగా రక్తదాన శిబిరానికి రావాలని, రక్తదాతలను సమకూర్చాలని విన్నవించారు. మధుసూదన్‌రెడ్డి, వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

చీరకట్టులో పంట పొలాలు



దండేపల్లి, అక్టోబరు 26 : రంగు రంగుల చీరల ను కట్టి రైతులు పంటలను రక్షించుకుంటు న్నారు. పెద్దపేట-లక్ష్మీకాంతపూర్ గ్రామాల మధ్య వరి పంటల చుట్టూ చీరలు కట్టారు. పందులు, పశువులు, పక్షుల నుంచి కాపాడుకునేందుకు చీరలు చుట్టామని రైతులు పేర్కొన్నారు.

మంచినీటి సహాయకులకు శిక్షణ తరగతులు


శిక్షణ తరగతులకు హాజరైన జిల్లాపంచాయతీ అధికారి

జైపూర్, సెప్టెంబరు 26: మండల కేంద్రంలోని రైతు వేది కలో ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో మంచినీటి సహాయకుల శిక్ష ణ తరగతులు కొనసాగుతున్నాయి. గురువారం జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు మాట్లాడారు. శిక్షణ పూర్తి చేసుకున్న అనంతరం గ్రామపంచాయతీల్లో తాగునీటి సరఫ రాలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా జాగ్రత్తలు తీసుకో వాలని సూచించారు. మండల పంచాయతీ అధికారి బాపు రావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విద్యాసాగర్‌రావు, ట్రైనర్లు, మల్టీ పర్పస్ వర్కర్లు పాల్గొన్నారు. అనంతరం స్వచ్ఛతాహి సేవలో పాల్గొని శ్రమదానం చేస చెత్తా,చెదారం తొలగించారు.

కాసిపేట: నాలుగు రోజులుగా గ్రామ మంచినీటి సహాయకులకు ఇచ్చిన శిక్షణ తరగతులు గురువారం ముగిశాయి. నీటి వినియోగం, నాణ్యత, సరఫరా ఎలా చేయాలని, వాటర్ ట్యాంకుల శుభ్రత అంశాలపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ రవీందర్ మాట్లాడుతూ ఎలాంటి అంతరాయం లేకుండా ప్రజలకు నీటి సరఫరా చేయాలన్నారు. ఎంపీడీవో సత్యనారాయణసింగ్, డిప్యూటీ ఈఈ ప్రవీణ్‌కుమార్, ఎంపీవోసవ్దర్‌ఆలీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయిఅచ్యుత్, శిక్షకులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలి

జైపూర్, సెప్టెంబరు 26: ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలని తపస్ జిల్లా అధ్యక్షుడు ఎస్. శ్రీనివాసరావు పేర్కొన్నారు. తపస్ సభ్యత్వ అభియాన్‌లో భాగంగా ముదిగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పలువురు ఉపాధ్యాయులకు సభ్యత్వం అందజేశారు. ఆయన మాట్లాడుతూ రెండు సంవత్సరాలుగా జీపీఎఫ్, జీఎల్‌ఐ రుణాల బిల్లులు, సంపాదిత సెలవుల బిల్లులు, మెడికల్ రీయింబర్స్‌మెంట్ పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఉద్యోగ విరమణ చేసిన పెన్షనర్లకు రావాల్సిన ప్రయోజనాలు అలస్యమవుతున్నాయన్నారు. సత్తిరెడ్డి, నరహరిప్రసాద్ పాల్గొన్నారు.

రత్నజానకిని సన్మానించిన కలెక్టర్

మందమర్రిటౌన్, సెప్టెంబరు 26: పాత బస్టాండ్‌కు చెందిన కవి రచయిత్రి సొత్కు రత్నజానకిని కలెక్టర్ కుమార్ దీపక్ గురువారం కలెక్టర్‌లో సన్మానించారు. రచనలు ప్రజా చైతన్యానికి దోహదపడాలని ఆకాంక్షించారు. సొత్కు సుదర్శన్ పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

కాకా వర్ధంతి, జయంతి అధికారికంగా నిర్వహించేందుకు ఉత్తర్వులు

మందమర్రిటౌన్, సెప్టెంబరు 26: సీనియర్ కాం గ్రెస్ నేత, మాజీ కేంద్రమంత్రి కాకా జీ.వెంకటస్వామి జయంతి, వర్ధంతి వేడుకలను అధికారికంగా నిర్వహిం చేందుకు గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విద్యార్థి దశ నుంచి ఆరు దశాబ్దాల పాటు కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి నిరంతరం కాకా కృషి చేశా రు. ఆయన తనయులు చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌వెంక టస్వామి, మనవడు పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణలు కాకా స్ఫూర్తితో మరిన్ని సేవలందించడానికి దృష్టి సారించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రు లకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

ఇసుక రీచ్‌లను గుర్తించండి

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 26 : జిల్లాలో ప్రజల అవసరాలకు అనుగుణంగా ఇసుక రీచ్‌లను గుర్తించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురు వారం కలెక్టర్ చాంబర్‌లో మైనింగ్, జిల్లా పంచాయ తీ అధికారి, ఇతర అధికారులతో సమావేశం నిర్వ హించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన ఇసుక రీచ్‌ల నిర్వ హణ వర్షాల కారణంగా నిలిచిపోయిందన్నారు. ప్రజల అవసరాల మేరకు ఇసుక సరఫరా చేసేందుకు నూతన ఇసుక రీచ్‌లను గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. మైనింగ్ ఏడీ జగన్‌మోహన్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

చెన్నూరు, సెప్టెంబరు 26: చెన్నూరు పట్టణంలోని 189 బూత్‌లో గురువారంం బీజేపీ నాయకులు సభ్య త్వ నమోదు చేపట్టారు. సభ్యత్వ నమోదు కన్వీనర్ శ్రీనివాస్ మాట్లాడుతూ 8800002024కు మిస్ కాల్ ఇప్పించి సభ్యత్వ నమోదు చేపట్టాలన్నారు. ప్రధాని మోదీ పాలన చూసి ప్రజలు పెద్ద ఎత్తున సభ్యత్వం తీసుకుంటున్నారన్నారు. కౌన్సిలర్ వెంకటనర్సయ్య, తిరుపతి, శ్రీపాల్, మాణిక్, రాజేష్, శంకర్ ఉన్నారు.

మల్టీపర్పస్ వర్కర్లకు ప్రమాద బీమా

తాండూర్, సెప్టెంబరు 26: అచ్చలాపూర్ గ్రామ పంచాయతీలోని మల్టీపర్పస్ వర్కర్లు 8మందితో పా టు రేచిని గ్రామంలోని 8మందికి గురువారం ప్రమా ద బీమా రూ.15 లక్షలు వర్తించేలా పంచాయతీ నిధు ల నుంచి ఒక్కొ క్కరికి రూ.755 చొప్పున బీమా చేయించామని ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. కార్మికు లకు ఆర్థిక భరోసా ఉంటుందన్నారు. తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్, కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

వరిలో తెగుళ్లు నివారించుకోవాలి

నెన్నెల, సెప్టెంబరు 26: వరి పంటలో ఉల్లికోడు, ఆకు చుట్టు పురుగు ఉధృతి అధికంగా ఉందని, నివా రణ చర్యలు చేపట్టాలని ఏఈవో రాంచందర్ సూచిం చారు నెన్నెల, ఖర్జి, దమ్మిరెడ్డిపేటల్లో గురువారం పంట పొలాలను పరి శీలించి రెతులకు సలహాలు, సూచనలిచ్చారు. ఉల్లికోడు నివారణకు పిప్రొనిల్ 5ఎ స్పీ, ఆకుచుట్టు పురుగు నివారణకు కారటాప్ హైడ్రో క్లోరైడ్ 50 ఎస్‌పీ 2 గ్రాములు లేదా క్లోరంతనిల్ ప్రోల్ 0.3 ఎంఎల్ లీటరు నీటిలో కలిపి స్ప్రే చేయాలన్నారు.

పత్తి పంట పరిశీలన

మందమర్రిరూరల్, సెప్టెంబరు 26: అమరవాది శివారులోని పత్తిపంటలను జిల్లా వ్యవసాయాధికారి కల్పన పరిశీలించారు. రైతులకు పత్తిలో ఆకుపచ్చ తెగుళ్ల నివారణ చర్యల గురించి సూచనలు చేశారు. ఏఈవోలు తిరుపతి, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వస్తువులను వాడవద్దు

నస్పూర్, సెప్టెంబరు 26: ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని మున్సిపల్ కమిషనర్ చిట్యాల సతీష్ సూచించారు. స్వచ్ఛతా హీ సేవాలో భాగంగా గురువారం మున్సిపల్ కార్యాలయంలో వివిధ విభాగాల అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆఫీస్‌లో ప్లాస్టిక్ వాడకం తగ్గించాలన్నారు. వాటర్ బాటిల్స్, లంచ్ బాక్సులు స్టీల్ వినియోగించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి పర్యావరణాన్ని కాపాడే ప్రయత్నం చేయాలన్నారు. ఏఈ మధు, రెవెన్యూ ఆఫీసర్ శ్రీనివాస్, ఆర్‌ఐ తిరుపతి, రష్మిణి, ప్రశాంత్, పాల్గొన్నారు.

హాజీపూర్: ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని డీఎల్‌పీవో ధర్మరాణి అన్నారు. ముల్కల్లలో నిర్వహించిన స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్లాస్టిక్ వినియోగించవద్దని ప్రజలకు సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి రిజిష్టర్‌లను పరిశీలించారు. కార్యదర్శి శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: అందుగులపేట, సారంగపల్లి, మామిడిగట్టు, ఆదిల్‌పేట గ్రామాల్లో స్వచ్ఛతా హి సేవలో భాగంగా పారిశుధ్య పనులను చేపట్టారు. సిబ్బంది చెత్తా, చెదారం తొలగించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. సంధ్యారాణి, వీరేందర్, లింగయ్య పాల్గొన్నారు.

బెల్లంపల్లి: మున్సిపాలిటీలో విధులు నిర్వహించే పారిశుధ్య కార్మికులకు స్వచ్ఛతాహి సేవలో భాగంగా ఆరోగ్య శిబిరం నిర్వహించారు. వైద్య సిబ్బంది కార్మికులకు పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, కమిషనర్ శ్రీనివాస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చెన్నూరు: చెన్నూరు మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు వైస్ చైర్మన్‌నవాజుద్దీన్, కమిషనర్ గంగాధర్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. కౌన్సిలర్లు మహేష్, శ్రీను, డాక్టర్‌లు సత్యనారాయణ, ప్రసన్న, నాయకులు పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయాలి

హాజీపూర్, సెప్టెంబరు 26: గురుకుల పాఠశాలల సమస్యల పరిష్కారానికి ఈ నెల 28న నిర్వహించే ఛలో హైద్రాబాద్ మహాధర్నాను విజయవంతం చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రాల రాజవేణు కోరారు. గురువారం ముల్కల్ల, గుడిపేట గురుకుల పాఠశాలలను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ 010 పద్దు కింద ప్రతీ నెల 1వ తేదీన జీతాలు చెల్లించాలన్నారు. కాల నిర్ణయ పట్టికను సవరించాలని, వార్డెన్‌లను, కేర్ టేకర్‌లను నియమించాలని, హెల్త్ కార్డులు ఇవ్వాలని కోరారు. పార్ట్‌టైం, కాంట్రాక్టు ఉపాధ్యాయులకు మినిమం టైం స్కేల్ అమలు చేయాలని, ఉపాధ్యాయులకు బోధనేతర పనులు చెప్పకూడదన్నారు.

గర్మిళ్ల: గురుకుల పాఠశాలల సమస్యల పరిష్కరించాలని ఈ నెల 28న నిర్వహించే ఛలో హైద్రాబాద్ మహాధర్నాను విజయవంతం చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రాల రాజవేణు కోరారు. గురువారం మంచిర్యాల పట్టణంలోని గురుకుల పాఠశాలలను సందర్శించారు. ధర్నాలో ఉపాధ్యాయులు పాల్గొని వియవంతం చేయాలన్నారు. నాయకులు కిరణ్, దేవదాసు తదితరులు పాల్గొన్నారు.

న్యాయ విజ్ఞాన సదస్సు


సదస్సులో పాల్గొన్న జడ్జి

భీమారం, సెప్టెంబరు 26: కేజీబీవీ పాఠశాలలో గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. చెన్నూరు మున్సిఫ్ కోర్టు జడ్జి రవి విద్యార్థినులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. ఏఎస్‌ఐ భూమన్న, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ కనకలక్ష్మీ, న్యాయవాదులు రాంబాబు, మహేష్ పాల్గొన్నారు.

పారిశుధ్య పనులను ముమ్మరంగా నిర్వహించాలి

వేమనపల్లి, సెప్టెంబరు 26: గ్రామాల్లో పారిశుధ్య పనులను ముమ్మరంగా నిర్వహించాలని జెడ్పీసీఈవో గణపతి పేర్కొన్నారు. గురువారం నీల్వాయి, కల్లెంపల్లి గ్రామాల్లో పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వర్షాలు పడుతున్న నేపథ్యంలో రోడ్లు, మురికి కాలువలను శుభ్రం చేయాలని, వర్షం నీరు నిల్వ ఉండకుండా తొలగించాలని సూచించారు. తడి, పొడి చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలించాలని, దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టాలన్నారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. నీల్వాయి కేజీబీవీ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో నీటి ట్యాంకులను శుభ్రం చేయాలని, నర్సరీల కోసం స్థలాలను ఎంపిక చేయాలని, ఉపాధిహామీ పనులను గుర్తించాలన్నారు. ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, ఏపీవో సత్యప్రసాద్, మదుకర్ పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మ ఆశయ సాధనకు పాటుపడాలి

• కలెక్టర్ వెంకటేష్ దోత్రే


ఆసిఫాబాద్‌లో నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, సెప్టెంబరు 26: భూమి కోసం, భుక్తి కోసం,వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. గురువారం చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ ఐలమ్మ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఉద్యమించారని చెప్పారు. ఇలాంటి మహనీయుల చరిత్రను భావితరాలకు అందించి వారి ఆశయాలకు అనుగుణంగా అందరు సమిష్టిగా పని చేయాలని అన్నారు. రజక కూలీల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని జిల్లాలో మహనీయుల విగ్రహాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దీపక్‌తివారి, ఆర్డీవో లోకేశ్వర్ జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి సజీవన్, జిల్లా అధికారులు, ప్యాక్స్ అధ్యక్షుడు అలీబీన్ అహ్మద్, జిల్లా రజక సంఘం అధ్యక్షుడు మల్లయ్య, బీసీ సంక్షేమ సంఘం నాయ కలు రమేష్, మారుతి, గణపతి, సంతోష్, సాయి తదితరులు పాల్గొన్నారు.


కాగజ్‌నగర్‌లో చాకలి ఐలమ్మ వర్థంతి వేడుకల్లో పాల్గొన్న నాయకులు

ఆసిఫాబాద్: చాకలి ఐలమ్మ జీవితం ఎంతో మందికి స్ఫూర్తిదాయకమని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. . కార్యక్రమంలో సీఐలు సతీష్, రాణా ప్రతాప్, కేశవులు, ఆర్ఐలు పెద్దన్న, అంజన్న, సిబ్బంది పాల్గొన్నారు.

కాగజ్‌నగర్: చాకలి ఐలమ్మ ఆశయాలను కొనసాగించాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే దండే విఠల్ అన్నారు. గురువారం కాగజ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ వర్థంతి వేడుకల్లో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్మన్ సిడాం గణపతి, నాయకులు శరత్, షబ్బీర్ హుస్సేన్, ఎల్లయ్య, లచ్చయ్య, శంకరయ్య, నంబాల రాజేష్, రాజు, వెంకటేశ్, కరుణాకర్ అనిల్ తదితరులు పాల్గొన్నారు. చాకలి ఐలమ్మను ప్రతి ఒక్కరు స్ఫూర్తిగా తీసుకోవాలని సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లా తెలిపారు. గురువారం కాగజ్‌నగర్ పట్టణంలో చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకల్లో ఆమె మాట్లాడారు. చ కార్యక్రమంలో స్థానిక నాయకులు, రజక సంఘం సభ్యులు పాల్గొన్నారు. పట్టణంలో గురువారం చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ పార్టీ సిర్పూరు నియోజకవర్గ కన్వీనర్ లెండుగురే శ్యాంరావు మాట్లాడుతూ చాకలి ఐలమ్మ ఆశయాలను అంతా కొనసాగిద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు నక్క మనోహర్, మోయిన్, దాసరి నరేందర్, ఆవుల రాజ్‌కుమార్, సలీం, గోగర్ల కన్నయ్య, సలీం, శోభన్, అంజన్న, మేడ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

వాంకిడి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం చాకలి ఐలమ్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ చంద్రయ్య, అధ్యాపకులు సురేందర్‌కుమార్, సంతోష్, రాజమౌళి, శ్రీధర్, కిరణ్‌కుమార్, తిరుపతి, సంతోష్, సత్యం, శ్రీకాంత్, అశ్విని తదితరులు పాల్గొన్నారు.

బెజ్జూరు: మండల కేంద్రంలో గురువారం చాకలి ఐలమ్మ జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో రజక సంగం నాయకులు చిరంజీవి, వెంకటేష్, శ్రీనివాస్,రాకేష్, రవి, రాకేష్, కార్తీక్, నాయకులు బ్రహ్మయ్య, తిరుపతి, జావీద్, శేఖర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సిర్పూర్(టి): మండల కేంద్రంలో రజక సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుప త్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేవారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు హనుమంతు, బండు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

- ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనసూర్య

దహెగాం, సెప్టెంబరు 26: అనుబంధ పోషకాహార కార్యక్రమంపై అంగన్‌వాడీ టీచర్లకు ఇచ్చిన సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనసూర్య అన్నారు. గురువారం దహెగాం మండలంలోని బీబా రైతు వేదికలో ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లోకి వచ్చే పిల్లలకు పిల్లల బరువు, ఎత్తులో పోల్చినప్పుడు ఏమైనా లోపాలు ఉంటే వెంటనే గుర్తించాలన్నారు. లోపాలు ఉంటే మెడికల్ సిబ్బంది సహకారంతో వెంటనే వారికి ఉన్నత చికిత్స అందేలా చర్యలు తీసుకోవాల న్నారు. కొంత మేరకు బాగానే ఉన్న పిల్లలకు ఎస్ఎస్ఎఫ్‌పీ ద్వారా బాలామృతం, ఇతర పోషకాలతో కూడిన ఆహారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

చింతలమానేపల్లి: పిల్లలకు పోషకాల ఆహారం తప్పనిసరి అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శంకరమ్మ అన్నారు. మండలంలోని బాలాజీ అనుకోడ గ్రామంలోని రైతు వేదికలో గురువారం ఐసీడీఎస్ సిబ్బంది, హెల్త్ సిబ్బందికి పర్యవేక్షణతో కూడి అనుబంధన పోషకాహార కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల్లోకి వచ్చే పిల్లలకు బరువు, ఎత్తుతో పోల్చినప్పుడు ఏమైనా లోపాలు ఉంటే వెంటనే గుర్తించి మెడికల్ సిబ్బంది సహకారంతో వెంటనే వారికి ఉన్నత చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. కొంత మేరకు బాగానే ఉన్న పిల్లలకు ఎస్ఎస్ఎఫ్‌పీ ద్వారా బాలామృతం, ఇతర పోషకాలతో కూడిన ఆహారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సుమతి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎం తదితరులు పాల్గొన్నారు.

చలో హైదరాబాద్ పోస్టర్ల ఆవిష్కరణ


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కాగజ్‌నగర్, సెప్టెంబరు 26: హైదరాబాద్‌లో శుక్రవారం చేపట్టే చలో హైదరాబాద్ పోస్టర్లను ఎస్ఎఫ్ఐ నాయకులు గురువారం పట్టణంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి చాపిలే సాయి కృష్ణ మాట్లాడుతూ విద్యా రంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 27న హైదరాబాద్‌లో మహాగర్జన కార్యక్రమం చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు నితీష్, కార్తిక్, చిత్తరంజన్, తేజస్విని, తదితరులు పాల్గొన్నారు.

పోలీసుస్టేషన్‌ను తనిఖీ చేసిన డీఎస్పీ

పెంచికలపేట, సెప్టెంబరు 26: పెంచికలపేట మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌ను గురువారం కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో పలు రికార్డులను పరిశీలించి సిబ్బంది సమావేశం న్విహించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఎస్సై కొమురయ్య, పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై దృష్టి సారించాలి

కాగజ్‌నగర్, సెప్టెంబరు 26: చదువులో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కోఆర్డినేటర్ మధూకర్ తెలిపారు. గురువారం స్థానిక డీఆర్సీ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పిల్లలను అన్ని రంగాల్లో రాణించేందుకు సిద్ధం చేయాలని సూచించారు. అలాగే ఉపాధ్యాయులు సర్వే షార్ట్-1 ప్రారంభించాలన్నారు. దీని కోసం చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్ బాలకృష్ణ, సతీష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

• సంక్షిప్తం..

ఎంఈవోగా బాధ్యతల స్వీకరణ

వాంకడి, సెప్టెంబరు 26: వాంకిడి ఎంఈవోగా శివచరణకుమార్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన మనుకుమార్ ఇంద్రవెల్లికి బదిలీపై వెళ్లగా వాంకిడి ఉన్నత పాఠశాలలో పీజీ హెచెంగా పని చేస్తున్న శివకుమార్‌కు బాధ్యతలు అప్పగించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ మండలాధ్యక్షుడు వినేశ్, హెచ్ఎం నటరాజ్, ప్రమోద్, జగదీష్, శ్రీనివాస్, దుర్గయ్య పాల్గొన్నారు.

కెరమెరి: కెరమెరి ఎంఈవోగా ఆడె ప్రకాష్ బాధ్యతలు స్వీకరించారు. గోయగాం జిల్లా పరి షత్ ఉన్నత పాఠ శాలలో పీజీ హెచ్ఎంగా పని చేస్తున్న ఆయనకు బాధ్యతలు అప్పగించారు.

బెజ్జూరు: బెజ్జూరు ఎంఈవోగా సునీత బాధ్యతలు స్వీకరించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో పీజీ హెచ్ఎంగా పని చేస్తున్న సునీత ఎంఈవోగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఉపాధ్యాయులు ఆమెను శాలువాతో సన్మానించారు.

ఎంఈవోకు సన్మానం

రెబ్బెన, సెప్టెంబరు 26: రెబ్బెన మండల ఎంఈవో వెంకటేశ్వర్లను గురువారం పీఆర్టీయూ టీఎస్ మండల శాఖ ఆధ్వర్యంలో గురువారం సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్, మండల అధ్యక్షుడు సదానందం, మండల ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, మండల ఉపాధ్యక్షుడు వినోద్ పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

రెబ్బెన, సెప్టెంబరు 26: రూం టూ స్వచ్ఛంద సంస్థ రూపొందించిన పోస్టర్లను ఎంఈవో వెంకటేశ్వర్ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు కథ పుస్తకాలను, స్టోరీ కార్డ్స్‌ను ఉపాధ్యాయులకు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనేతర రైతులకు న్యాయం చేస్తాం

- ఎమ్మెల్సీ దండె విఠల్


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దండె విఠల్

కౌటాల, సెప్టెంబరు 26: ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజనేతర రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. గురువారం మండలంలోని తలోడి గ్రామంలో రైతులతో ఆయన సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా బండపాటి శివారులో తలోడి, గురుడుపేట, కన్నెపల్లి, కనికి, ఇతర గ్రామాల రైతులకు భూములు ఉన్నాని,వాటిని ఏళ్ల తరబడి సాగు చేస్తున్నప్పటికీ వాటికి ఇప్పటి వకు ఎలాంటి ఆదారాలు లేక ఇబ్బందులు పడుతున్నామని, తమకు న్యాయం చేయాలని రైతులు కోరారు. స్పందించిన ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 30 వేల మంది రైతులు ఇదే సమస్యతో బాధపడుతున్నారని, ఈ సమస్యను మంత్రి సీతక్క ద్వారా సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తామన్నారు. కలెక్టర్‌తో మాట్లాడి ముందుగా రైతుల వివరాలను సేకరించి వాటి ద్వారా రైతులకు న్యాయం చేస్తామన్నారు. సాధ్యమైంతన వరకు రైతులకు హక్కు పత్రాలు లేదా సాగు పత్రాలు ఇచేచలా తన వంతు కృషి చేస్తానని అన్నారు. అనంతరం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన లహనుబాయి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహయం అందజేశారు. పంచాయతీ కార్యాలయంలో చాకలి ఐలమ్మ జయంతి కార్యక్రమంలో పాల్గొని పూల మాల వేసి నివాళుఉల అర్పించారు. ఆయన వెంట నాయకులు సిడాం గణపతి, విశ్వనాథ్, నానయ్య, గంగారాం, రవీందర్, తిరుపతి, గోపాల్, బాపు తదితరులు ఉన్నారు.

• విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

కౌటాల, సెప్టెంబరు 26: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠవాలలో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని పలు మండలాల 27 బాయ్స్, 21 గర్ల్స్ మొత్తం 48 జట్లు పాల్గొన్నాయి. బాలుర ఫైనల్‌లో కాగజ్‌నగర్ మైనార్టీ రెసిడెన్షియల్ మొదటి, మొగడ్‌దగడ్ ఆశ్రమ పాఠశాల రెండో స్థానంలో నిలిచాయి. గర్ల్స్ ఫైనల్‌లో ఆసిఫాబాద్ ట్రైబల్ వెల్ఫేర్ మొదటి, రెబ్బెన సోషల్ వెల్ఫేర్ రెండో స్థానంలో గెలుపొందాయి. వీరితో పాటు ఆటల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన పలువురిని జిల్లా స్థాయి పోటీలకు కమిటీ సభ్యులు ఎంపిక చేశారు. కాగా కబడ్డీ పోటీల్లో నిర్వహణ కమిటీ సభ్యులు అవకతవకలు చేశారని సెమీస్‌లో గెలిచినప్పటికీ తమ టీంను ఆడించలేదని మండల కేంద్రానికి చెందిన మయూరి విద్యాలయం విద్యార్థులు కోర్టులో కూర్చొని నిరసన తెలిపారు. స్పందించి కమిటీ సభ్యులు విద్యార్థులను, ఉపాధ్యాయులను సముదాయించి ముగ్గురు విద్యార్థులను జిల్లా స్థాయికి ఎంపిక చేయడంతో నిరసన విరమించారు. ఎమ్మెల్సీ దండె విఠల్ క్రీడాకారులను పరిచయం చేసుకుని క్రీడలను ప్రారంభించారు. ఎంఈవో హనుమంతు, హెచ్ఎంలు నారాయణసింగ్, పీడీలు సాంబశివరావు, మధుకర్, హరికృష్ణ, జోసెఫ్, తదితరులు పాల్గొన్నారు.

• సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

సిర్పూర్(టి), సెప్టెంబరు 26: మండలంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. మండల కేంద్రంలో పార్టీ ముఖ్య నేతలతో గురువారం సమావేశమయ్యారు. మండలంలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్కరూ సహకరించా లన్నారు. మండల నుంచి మహారాష్ట్ర రాజురాకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరగా వెంటనే ఆసిఫాబాద్ డిపో మేనేజర్‌కు ఫోన్ చేసి బస్సు సౌకర్యం కల్పించాలని సూచించారు. గ్రామాల్లో రోడ్ల సమస్యను తెలుసుకున్నారు. ఆయన వెంట నాయకులు సిడాం గణపతి, కిశోర్, సోహెల్, రాజు, అఖిల్, అఫ్సార్, తరు ణ్, వసంత్, అశోక్, తుల సీరాం, సలీం తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మంచిర్యాల
జిల్లా వార్తలు
5
శుక్రవారం 27 సెప్టెంబరు 2024





వాహన టెండర్లు జరిగేనా..?

- ధాన్యం రవాణా కోసం లారీల నోటిఫికేషన్
- ఆన్‌లైన్ పద్ధతిలో దరఖాస్తుల ఆహ్వానం
- రెండు సీజన్‌లకు 40 లారీలకు టెండర్లు
- నాలుగు సెక్టార్లకు తొమ్మిది ఏజెన్సీల నుంచి దరఖాస్తులు

మంచిర్యాల, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ధాన్యం రవాణా చేసే లారీల టెండర్లు ఈసారైనా జరిగేనా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ప్రతి సారీ ధాన్యం రవాణాకు లారీలకు టెండర్లు ఆహ్వానించడం అనంతరం నేరుగా పనులు అప్పగించడం జిల్లాలో కొన్నాళ్లుగా ఆనవాయితీగా వస్తోంది. అయితే నిబంధనల మేరకు టెండర్ల ద్వారానే కాంట్రాక్టర్లను ఎంపిక చేయాలనే డిమాండ్‌లు సర్వత్రా వినిపిస్తున్నాయి. అధికారులు ఈసారి టెండర్ ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహించడం ద్వారా అర్హులకు పనులు అప్పగించాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ధాన్యం తరలింపునకు...

జిల్లాలో వానాకాలం, యాసంగి (2024-25) సీజన్లలో సేకరించే ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల నుంచి రైస్‌మిల్లులకు, అక్కడ బియ్యంగా మారిన తరువాత తిరిగి మండల లెవల్ స్టాకిస్టు పాయింట్లకు, అక్కడి నుంచి రేషన్ షాపులకు సరుకును తరలించాల్సి ఉంటుంది. ఇందుకు లారీలు అవసరం కావడంతో ఆసక్తిగలవారి నుంచి జిల్లా పౌర సరఫరాల శాఖ టెండర్లు ఆహ్వానించింది. అధికారులు ఆగస్టు 23న ఈ ప్రొక్యూర్ మెంట్ పద్ధతిలో ఆన్‌లైన్ టెండర్లను ఆహ్వానించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 40 లారీలు అవసరం ఉండగా, ఈ నెల 17వ తేదీ వరకు గడువు ముగిసే సమయానికి తొమ్మిది ఏజెన్సీల నుంచి టెండర్లు దాఖలయ్యాయి. టెండర్లను ఓపెన్ చేసి, కోట్ తక్కువ చేసిన ఏజెన్సీకి టెండర్లు అప్పగించాల్సి ఉంటుంది. అయితే జిల్లా వ్యాప్తంగా నాలుగు సెక్టార్లు ఉండగా, సెక్టార్ 1, 2 రెండింట్లో మాత్రం నిబంధనలకు విరుద్ధంగా పనులు అప్పగించేందుకు రంగం సిద్ధమైనట్లు ప్రచారం జరుగుతోంది.

లారీల కొరతతో ఇబ్బందులు

జిల్లాలో అర్హులైన లబ్ధిదారులకు రేషన్ బియ్యం సరఫరా చేసేందుకు 423 చౌకధరల దుకాణాలు ఉన్నాయి. వీటికి నెలకు సగటున 100 క్వింటాళ్ల వరకు బియ్యం అవసరం ఉంటుంది. ప్రతినెల 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు దుకాణాల్లో డీలర్లు బియ్యం ఇవ్వాల్సి ఉండగా, లారీల కొరత కారణంగా సరుకు ఆలస్యంగా అందుతోంది. దీంతో బియ్యం ఎప్పుడు పోస్తారో తెలియని పరిస్థితుల్లో లబ్ధిదారులు షాపుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తుండేవారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ తరువాత పరిస్థితిలో కొంచెం మార్పు వచ్చినా పూర్తిగా గాడిలో పడలేదనే చెప్పాలి. జిల్లాలో ఎంఎల్‌ఎస్ పాయింట్ల నుంచి రేషన్ షాపులకు తరలించేందుకు 40 లారీలు అవసరం ఉంటాయి. మంచిర్యాల ఎంఎల్‌ఎస్ పాయింట్‌కు ఆరు లారీలు విధిగా కేటాయించాలి. గత సంవత్సరం స్టేజ్-2 కాంట్రాక్టర్ కేవలం రెండు లారీలు నడపడంతో సమయానికి బియ్యం సరఫరా సక్రమంగా జరుగలేదు. స్టేజ్-1 కాంట్రాక్టర్ మిల్లుల నుంచి బియ్యాన్ని ఎంఎల్‌ఎస్ పాయింట్లకు తరలించడంతో అక్కడి నుంచి నేరుగా స్టేజ్-2 కాంట్రాక్టర్ అవే లారీలతో షాపులకు తరలించే ఏర్పాట్లు చేసుకున్నట్లు తెలుస్తోంది. తద్వారా స్టేజ్-2 కాంట్రాక్టర్‌కు నాలుగు లారీలు ఆదా కాగా, ప్రజలు మాత్రం నానా ఇబ్బందులు పడ్డారు.

టెండర్లకు పోటాపోటీ

జిల్లాలో ఈసారి లక్షా 16వేల ఎకరాల నుంచి మూడు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసేందుకు అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. సేకరించిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించేందుకు దూరాన్ని బట్టి ప్రభుత్వం లారీ అద్దె చెల్లిస్తోంది. ఈ సొమ్ము పెద్ద మొత్తంలో ఉండడంతో పోటాపోటీగా టెండర్లు దాఖలయ్యాయి. మరోవైపు కొనుగోలు కేంద్రాల్లో తూకం పూర్తయ్యాక రైస్‌మిల్లులకు ధాన్యం తరలించేందుకు రైతుల నుంచి అక్రమంగా డబ్బు వసూలు చేస్తుండడం కూడా లారీ యజమానుల్లో పోటీకి మరో కారణంగా తెలుస్తోంది. జిల్లాలో సెక్టార్-1, 2 కింద లక్షెట్టిపేట, మంచిర్యాల ఎంఎల్‌ఎస్ పాయింట్లు ఉండగా వాటిలో టెండర్ల నిబంధనలకు విరుద్ధంగా కాంట్రాక్ట్ అప్పగించేందుకు రంగం సిద్ధమైనట్లు ప్రచారం జరుగుతోంది. ఈ రెండు సెక్టార్లకు సంబంధించి ఒక్కో కాంట్రాక్టర్ ఎంపిక దాదాపుగా పూర్తికాగా హైద్రాబాద్‌లోని పౌర సరఫరాలశాఖ ప్రధాన కార్యాలయానికి కూడా పంపినట్లు సమాచారం. ఆన్‌లైన్ టెండర్లు ఆహ్వానించినందున నిబంధనల మేరకే కాంట్రాక్టర్లను ఎంపిక చేయాలని లారీల యజమానులు కోరుతున్నారు.

ఐఎంఏ కమిటీ ఎన్నిక



డాక్టర్ రమణ

మంచిర్యాల, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐ ఎంఏ) జిల్లా కమిటీ 2024- 25ను గురువారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ వీరమణ, కార్యదర్శిగా విశ్వేశ్వరరావు, కోశాధికారిగా స్వరూపారాణి, ఉపాధ్యక్షులుగా పద్మ, ఎస్‌శ్రీనివాస్, ఆర్ రవిప్రసాద్, ఎస్‌నవీన్, కళావతి, జాయింట్ సెక్రెటరీలుగా ఏ జ్యోతి, జే సురేష్‌కుమార్, కుమార్‌గౌడ్, టి శ్రీలత, రాకేష్‌రెడ్డి, స్టేట్ కౌన్సిల్ మెంబర్లుగా లక్ష్మీనారాయణ, సంతోష్, యెగ్గెన శ్రీనివాస్, నీలకంఠేశ్వరరావు, సెంట్రల్ కౌన్సిలర్ మెంబర్లుగా అన్నపూర్ణ, మల్లేష్, శరత్‌బాబు, ఈసీ మెంబర్లుగా చంద్రదత్, ప్రవీన్‌కుమార్, రాకేష్ కుమార్, సురేష్, శ్రీధర్‌బాబు, ప్రసాద్, రాజేందర్‌లు ఎన్నికయ్యారు.

బాధ్యతలు స్వీకరించిన ఎంఈవోలు

దండేపల్లి, సెప్టెంబరు 26 : మండల విద్యా వనరుల కేంద్రంలో గురువారం ఎంఈవోగా దుర్గం చిన్నయ్య బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు జన్నారం ఎంఈవో ఇన్‌చార్జిగా కొనసాగారు. కోర్విచెల్మ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్న చిన్నయ్య ఎంఈవోగా బాధ్యతలు స్వీకరించారు. ఎంఐసి నగేష్, సిఆర్‌పిలు నర్సయ్య, శ్రావణ్, రమేష్, రాజ్ మహ్మద్‌లు ఆయనను సన్మానించారు.

లక్షెట్టిపేటరూరల్: లక్షెట్టిపేట ఎంఈవోగా సీనియర్ ప్రధానోపాధ్యాయురాలు హెలెన్ దారతి మండల విద్యావనరుల కేంద్రంలో బాధ్యతలు స్వీకరించారు. ఇంతకాలం కాసుల రవీందర్ ఇన్‌చార్జీ ఎంఈవోగా పనిచేయగా ఆయన బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో హెలెన్ దారతి బాధ్యతలు చేపట్టారు. ఆమెకు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు.

ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ

భీమారం, సెప్టెంబరు 26: భీమారం ఎంపీడీవోగా మధుసూదన్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికి సన్మానించారు. మధుసూదన్ హాజీపూర్ నుంచి భీమారంకు బదిలీపై వచ్చారు. ఎంపీవో, ఏపీవో, కార్యదర్శులు పాల్గొన్నారు.

హుండీ లెక్కింపు

గర్మిళ్ల, సెప్టెంబరు 26: మంచిర్యాల పట్టణంలోని విశ్వనాథ ఆలయ హుండీని గురువారం లెక్కించారు. ఆరు నెలల ఆదాయం రూ.3,17,060 వచ్చాయని పర్యవేక్షణ అధికారి రాజమౌళి తెలిపారు. ఆలయ ఈవో ముక్త రవి, దేవాలయ సిబ్బంది అంజయ్య, నరహరి శర్మ, బాలకృష్ణ శర్మ, శేషాచార్యులు, మహిళ సమితి సభ్యులు పాల్గొన్నారు.

ఆహ్లాదం.. ఆనందం...

కనువిందు చేస్తున్న అభయారణ్యాలు

నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం





కవ్వాల అభయారణ్యం



గాంధారి వనం

బెల్లంపల్లి, సెప్టెంబరు 26 : జిల్లాలో పలు ప్రకృతి అందాలు కనువిందు చేస్తున్నాయి. గలగల పారే జలపాతాలు, గోదావరి పరవళ్లు, పరుచుకున్న పచ్చదనం, ఆహ్లాదాన్ని పంచే అడవులు, పలు చారిత్రాత్మక కట్టడాలు, కవ్వాల్ అభయారణ్యం, పలు ఆలయాలు, ప్రాజెక్టులు పర్యాటకుల మదిని దోస్తున్నాయి. శుక్రవారం ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. పర్యాటకంపై అవగాహన పెంపొందించేందుకు 1980 నుంచి ఐక్యరాజ్య సమితి ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని సెప్టెంబరు 27న నిర్వహిస్తోంది. జిల్లాలో కుటుంబ సమేతంగా చూసేందుకు పలు ప్రదేశాలతోపాటు జంతు ప్రేమికులకు కవ్వాల అభయారణ్యం కనువిందు చేస్తోంది. జిల్లా కేంద్రానికి సమీపంలోని గాంధారి ఖిల్లాను చూడడానికి యేటా జాతర సమయంలోనే కాకుండా శని, ఆదివారాల్లో జిల్లాతో పాటు ఇతర ప్రాంతాల నుంచి ప్రజలు వస్తారు. జైపూర్ మండలంలోని శివ్వారం మొసళ్ల అభయారణ్యం. ఏసీసీ క్వారీ, ఎల్లంపల్లిప్రాజెక్టు, ఆధ్యాత్మికత ఉట్టిపడే గూడెం సత్యనారాయణ స్వామి ఆలయం, వన్య ప్రాణులను చూసేందుకు కవ్వాల అభయారణ్యం, జిల్లా ప్రజలకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి.

క్రైం రేటు తగ్గించే విధంగా పనిచేయాలి



పోలీసులకు సూచనలు ఇస్తున్న సీపీ శ్రీనివాస్

లక్షెట్టిపేటరూరల్, సెప్టెంబరు 26: క్రైం రేటును తగ్గించే విధంగా పోలీసులు సమన్వయంతో విధులు నిర్వహించాలని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. గురువారం లక్షెట్టిపేట పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. 5ఎస్ ఇంప్లిమెంటేషన్‌ను పరిశీలించి ఫైలు సక్రమమైన పద్ధతిలో ఉంచాలని సూచించారు. పోలీస్‌స్టేషన్‌లో ఉన్న రికార్డులను తనిఖీ చేశారు. నామినల్ రోల్స్ పరిశీలించి హెచ్‌ఆర్‌ఎంఎస్ తనిఖీచేసి డ్యూటీల ప్రకారం నామినల్ రోల్‌లో ఉండాలని తెలిపారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో ఏ తరహా కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయని, సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల సమస్యలు తీర్చడానికి ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని సూచించారు. రౌడీలు, సంఘ విద్రోహ శక్తులపై నిరంతరం నిఘా ఉంచాలన్నారు. చెడు ప్రవర్తన కలిగిన వ్యక్తులపై నిఘా ఉంచి వారి కదలికలను గమనించాలన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలన్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. డీసీపీ భాస్కర్, ఏసీపీ ప్రకాష్, సీఐ నరేందర్,ఎస్‌ఐ సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయ పనులను వేగవంతం చేయాలి



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్‌దీపక్

హాజీపూర్, సెప్టెంబరు 26: కేంద్రీయ విద్యాలయ భవన నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం మండలంలో నిర్మిస్తున్న కేంద్రీయ విద్యాలయ భవన నిర్మాణ పనులను ప్రిన్సిపాల్ జక్కుల ప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ కేంద్రీయ విద్యాలయం ద్వారా విద్యార్థులకు మెరుగైన విద్య అందించడంతో పాటు క్రీడా రంగాల్లో ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. భవనాన్ని రూ. 26 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్నామని, గుత్తేదారుల సమన్వయంతో త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

విచారణకు హాజరు కావాలని నోటీసులు



చెన్నూరు, సెప్టెంబరు 26: పట్టణంలోని గెర్రె ప్రాంతం 840 సర్వే నెంబరులో ఇంటి నిర్మాణాలు చేపట్టిన యజమానులకు గురువారం మున్సిపల్ అధికారులు నోటీసులు అందజేశారు. దీంతో ఇండ్లు, షెడ్లు నిర్మించుకున్న యజమానులు ఆందోళన చెందుతున్నారు. 840 సర్వే నెంబరులో నెల రోజుల క్రితం వాటర్ ట్యాంకు నిర్మాణానికి కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యేలు శంకుస్థాపన చేశారు. ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపట్టారన్న విషయం కలెక్టర్ దృష్టికి రావడంతో విచారణ జరపాలని రెవెన్యూ, మున్సిపల్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. 15 రోజుల క్రితం విచారణ చేపట్టిన అధికారులు 840 సర్వేనెంబరులో ఇంటి నిర్మాణాలు, షెడ్లు నిర్మించుకున్న వారు ఆధారాలతో విచారణకు హాజరు కావాలని నోటీసులు జారీ చేశారు. విచారణ సమయంలో సరైన ధ్రువీకరణ పత్రాలు సమర్పించకపోవడంతో 38 మంది ఇంటి నెంబర్లను ఆన్‌లైన్ రికార్డుల నుంచి తొలగించడం చర్చనీయాంశమైంది. మరో మారు శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించే విచారణకు ఇంటి యజమానులు హాజరు కావాలని నోటీసులు జారీ చేయడంతో ఆందోళన చెందుతున్నారు. ఇంటి నిర్మాణాలు చేపట్టిన సమయంలో అధికారులు అనుమతి, ఇంటి నెంబర్లను ఎలా ఇచ్చారని, ఇప్పుడు ఇంటి నెంబర్లను రద్దు చేయడం ఎంత వరకు సమంజసమని బాధితులు ప్రశ్నిస్తున్నారు.

కలెక్టరేట్ ఎదుట విద్యార్థుల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు

నస్పూర్, సెప్టెంబరు 26: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ కుమార్‌దీపక్‌కు అందజేశారు. యుఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి మాట్లాడుతూ నాలుగేళ్ళుగా ప్రభుత్వం విద్యార్థులకు స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయడం లేదన్నారు. విద్యార్థులు ఉన్నత చదువులకు కళాశాలల యాజమాన్యాలు ఇబ్బందులకు గురి చేస్తున్నాయన్నారు. అభినవ్, కీర్తి, యశస్విని పాల్గొన్నారు.

విద్యార్థి గర్జన సభను విజయవంతం చేయాలి

గర్మిళ్ల, సెప్టెంబరు 26: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని శుక్రవారం హైద్రాబాద్‌లో జరిగే విద్యార్థి గర్జన సభను విజయవంతం చేయాలని ఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఈదునూరి అభినవ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

బతుకమ్మ చీరల పంపిణీ



బతుకమ్మ చీరలు అందజేస్తున్న నాయకులు

దండేపల్లి, సెప్టెంబరు 26: నియోజకవర్గ మహిళలందరికి ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అండగా ఉంటూ యేటా బతుకమ్మ చీరలను అందిస్తున్నారని ఎమ్మెల్యే సోదరీమణులు రుక్మిణి, సత్యశ్రీలు అన్నారు. పలు గ్రామాల్లో రఘుపతిరావు ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ ట్రస్టు ద్వారా ఆరేళ్లుగా నిరుపేద కుటుంబాలకు ఆర్థిక సహాయం అందిస్తున్నారన్నారు. శ్రీనివాస్, శకుంతల, నాగరాణి, వెంకటేశ్వర్లు, సతీష్, దుర్గప్రసాద్, మోహన్, కమలాకర్, మౌలిక, రజిత, పాల్గొన్నారు.

విద్యాభారతి పాఠశాలకు డైనమిక్ అవార్డు



అవార్డు అందుకుంటున్న సురభి శరత్‌కుమార్

తాండూర్, సెప్టెంబరు 26: మండలంలోని విద్యాభారతి ఉన్నత పాఠశాలకు 2024 సంవత్సరానికి గాను డైనమిక్ స్కూల్ అవార్డు లభించినట్లు పాఠశాల డైరెక్టర్ సురభి శరత్ కుమార్ తెలిపారు. అవార్డును ఎడ్యుకేషన్ టుడే ఆధ్వర్యంలో బుధవారం హైద్రాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో జాకబ్ శేరాఫ్ చేతులమీదుగా సురభి శరత్‌కుమార్ అందుకున్నారు. విద్యా విధానాలు, టెక్నాలజీతో కూడిన విద్యను గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అందించినందుకు అవార్డు వచ్చినట్లు శరత్‌కుమార్ తెలిపారు. ప్రిన్సిపాల్స్, విద్యార్థుల తల్లిదండ్రులు ఆయనను అభినందించారు.

వ్యక్తిగత విమర్శలు మానుకోవాలి



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 26: బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లిపై కాంగ్రెస్ నాయకులు వ్యక్తిగత విమర్శలు మానుకోవాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి రాకేష్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు అశ్విన్ రెడ్డి, నస్పూర్ పట్టణ ప్రధాన కార్యదర్శి చక్రవర్తిలు పేర్కొన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బీజేపీకి పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేకనే కాంగ్రెస్ నాయకులు రఘునాథ్‌పై ఆరోపణలు చేస్తున్నారన్నారు. చిట్ల సత్యనారాయణ రఘునాథ్‌ను విమర్శించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. ఇప్పటికైనా అసత్య ఆరోపణలు మానుకుని అభివృద్ధికి కృషి చేయాలన్నారు. నాయకులు వెంకటేశ్వర్‌రావు, మల్లేష్, ప్రవీణ్, రాకేష్ రైన్వా, అశోక్, సదానందం, నాగేశ్వర్‌రావు, రాజన్న,వెంకటేశ్వర్లు, దేవేందర్, రాజన్న, పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

కోటపల్లి, సెప్టెంబరు 26: మండలంలోని సర్వాయిపేటలో గురువారం తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. బ్యాంకు మేనేజర్ రాజేష్‌కుమార్ బ్యాంకు పథకాలు, బీమా, పొదుపుపై ప్రజలకు వివరించారు. కార్యదర్శి శంకరయ్య, సిబ్బంది శ్రీకాంత్, ఐకేపీ మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

కోటపల్లి, సెప్టెంబరు 26: జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో గురువారం భౌతిక రసాయన శాస్త్ర స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన ఎస్.సురేందర్‌ను స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కృష్ణమూర్తి, జిల్లా సైన్స్ అధికారి మధుబాబు, జిల్లా ఎగ్జామినేషన్ సెక్రెటరీ భీంరావు, ఎంఈవో వెంకటేశ్వర్‌లు సన్మానించారు. సురేందర్ రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు సాధించడం గొప్ప విషయమని పేర్కొన్నారు. జిల్లా ఎగ్జామ్ అసిస్టెంట్ సెక్రటరీ కుమారస్వామి, కొట్టె శంకర్, చంద్రయ్య, శ్రీనివాస్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మ జీవితం స్ఫూర్తిదాయకం



ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ కుమార్‌దీపక్, బెటాలియన్‌లో నివాళులర్పిస్తున్న కమాండెంట్, సిబ్బంది

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 26: తెలంగాణ సాయుధ పోరాట వీరనారి చాకలి ఐలమ్మ జీవితం అందరికి స్ఫూర్తిదాయకమని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. గురువారం చాకలి ఐలమ్మ జయంతిని కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఐలమ్మ జీవితం ప్రతీ ఒక్కరికి ఆదర్శనీయమని తెలిపారు. ఐలమ్మ వర్ధంతి, జయంతిలను ప్రభుత్వం అధికారికంగా చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. అదనపు కలెక్టర్ మోతిలాల్, జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధికి అధికారి వినోద్‌కుమార్, రజక సంఘం నాయకులు బాపు, వెంకటేశం, రాజేశం, ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

హాజీపూర్: గుడిపేట బెటాలియన్‌లో చాకలి ఐలమ్మ జయంతి నిర్వహించారు. కమాండెంట్ వెంకటరాములు ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అసిస్టెంట్ కమాండెంట్ కాళిదాస్, పాల్గొన్నారు.

జన్నారం: జన్నారంలో చాకలి ఐలమ్మ జయంతిని బీసీ కులాల ఉద్యమ పోరాట సంఘం నాయకులు నిర్వహించారు. ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మల్లేష్, నర్సింహులు, చంద్రయ్య పాల్గొన్నారు.

నస్పూర్: నస్పూర్ కాలనీలోని రజక భవన స్థలంలో చాకలి ఐలమ్మ జయంతి నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు తంగళ్ల పల్లి బాపు, ఉపాధ్యక్షులు రాజయ్య, సారయ్య, రవీందర్, తిరుపతి, బాబు, బక్కయ్య పాల్గొన్నారు.

నెన్నెల: మండల రజక సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ జయంతిని నిర్వహించారు. ఐలమ్మ ప్రదర్శించిన ధైర్యసాహసాలు, చైతన్యం నేటితరానికి స్ఫూర్తిదాయకమన్నారు. ఆశాలు, లచ్చన్న, మహేష్, నవీన్ పాల్గొన్నారు.

బెల్లంపల్లిరూరల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చాకలి ఐలమ్మ జయంతి నిర్వహించారు. ప్రిన్సిపాల్ కాంపల్లి శంకర్ ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. రేణుబాబు గౌడ్, ఏకాంబరం, మురళీకృష్ణ, సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

చెన్నూరు: పట్టణంలో చాకలి ఐలమ్మ జయంతిని నిర్వహించారు. నాయకులు నాగరాజు, నారాయణ, మహేష్, షాహిర్, సుల్తాన్, మధు, మహేష్, అనిల్ పాల్గొన్నారు.

గర్మిళ్ల: పాత మంచిర్యాలలో చాకలి ఐలమ్మ జయంతి బహుజన సంఘాల నిర్వహించారు. శంకర్, సత్యనారాయణ, శ్రీనివాస్, కుమార్, అశోక్, పాల్గొన్నారు. చున్నంబట్టి వాడలో రజక రిజర్వేషన్ సమితి నాయకులు నిర్వహించారు. లక్ష్మణ్, ఎల్లయ్య, శంకర్, తిరుపతి పాల్గొన్నారు.

భీమారం: భీమారంలో కాంగ్రెస్ నాయకులు చాకలి ఐలమ్మ జయంతిని నిర్వహించారు. నరేష్, సుధాకర్, శ్యాంసుందర్‌రెడ్డి, రవి, సమ్మయ్య, మల్లేష్ పాల్గొన్నారు.

దండేపల్లి: రజకసంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ జయంతి నిర్వహించారు. కోఠి మహిళ విశ్వవిద్యాలయంకు చాకలి ఐలమ్మ పేరు ప్రకటించడంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.